ఈ గడ్డపై విద్వేషాలేంటి?

- హేతు, భౌతిక వాదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- విద్వేషాలతో ప్రజల్ని విడగొట్టేది హేట్‌వాదం
- ప్రమాదకర స్థితిలో కుల, మత, పార్టీతత్వాలు
- బుల్డోజర్ రాజకీయాల వెనుక కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాలు
- ప్రొఫెసర్ దేవరాజు మహారాజు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచానికి హేతువాదాన్నీ, భౌతికవాదాన్నీ పరిచయం చేసిందే భారతీయులనీ, ఇలాంటి గడ్డపై అధికారం కోసం పాలకుల విద్వేష రాజకీయాలు, ద్వేషపూరిత ప్రసంగాలు ఏంటని ప్రముఖ జీవ శాస్త్రవేత్త, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత ప్రొఫెసర్ దేవరాజు మహారాజు ప్రశ్నించారు. నేడు దేశంలో హేట్‌వాదం పెచ్చరిల్లిపోతున్న తీరుపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. కుల, మత తత్వాలకు తోడుగా పార్టీ తత్వం కూడా తీవ్రరూపం దాల్చడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజలకు హేతువాదంపై అవగాహన కల్పించేందుకు ప్రజాస్వామిక వాదులు, భౌతికవాదులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకునేవారు, ఇలా ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. 'హేతువాదమా? హేట్‌వాదమా? ప్రపంచానికి ఏది కావాలి?' అనే అంశంపై సుందరయ్యవిజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయంతో ఆదివారం నిర్వహించిన వెబినార్‌లో దేవరాజు మహారాజు మాట్లాడారు. బిజెపి పాలకుల బుల్డోజర్ రాజకీయాల వెనుక రాజకీయ లబ్ధితో పాటు కార్పొరేట్ల ఆర్థిక ప్రయోజనాలు కూడా దాగి ఉన్నాయని ఎత్తిచూపారు. మహారాష్ట్రలోని ముంబయి నడిబొడ్డున ఉన్న ప్రముఖ జైన మందిరాన్ని బుల్డోజర్లతో ఫడ్నవిస్ ప్రభుత్వం కూల్చేసిందన్నారు. ఆరు నెలల క్రితం రెన్యువేషన్‌కు అనుమతి ఇచ్చిన అదే సర్కారు ఇప్పుడు ఆ కట్టడాన్ని కూల్చిందనీ, లోతుల్లోకి వెళ్లిచూస్తే దాని పక్కనే ఉన్న ఓ కార్పొరేట్ హోటల్ విస్తరణ కోసం ఈ పనిచేసిందని వెల్లడైందన్నారు. ముంబయిలోని జైనులు పెద్ద వ్యాపారులనీ, వారు ఎక్కువ సంఖ్యలో బిజెపి వెనుకాలే ఉన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు బీజేపీకి కార్పొరేట్ల ప్రయోజనాలు ముఖ్యం కాబట్టి మైనార్టీలైన జైనులను పక్కనబెట్టేసిందని విడమర్చి చెప్పారు. ఇదే పద్ధతిలో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, తదితర బిజెపి పాలిత రాష్ట్రాల్లో జరిగిన పలు ఘటనలను ఉదహరణలతో వివరించారు. దేశంలో మోడీ సర్కారు వచ్చాక విద్వేషపూరిత ఉపన్యాసాలు, మారణహోమాలు పెరిగాయని ఎపిసిఆర్ నివేదిక ఎత్తిచూపిన అంశాన్ని ప్రస్తావించారు. ప్రధాని, బిజెపి పాలిత సిఎంలు, కేంద్ర మంత్రులు, ఎంపిలు..ఇలా కీలకమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు విద్వేషపూరిత ప్రసంగాలు చేయడమేంటని ప్రశ్నించారు. రాజ్యాంగ పదవుల్లో ఉన్న గవర్నర్లు, ఇద్దరు జడ్జీలు కూడా అదే బాటలో నడవటం పట్ల ఆందోళన వెలిబుచ్చారు. మీడియా కూడా కేంద్ర పాలకుల మైకంలో పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వార్తలు సేకరించి..ముద్రించి పాఠకులకు మీడియా యాజమాన్యాలు అమ్మేవనీ, ఇప్పుడు ముందే అమ్ముడుపోతున్నాయని ఆరోపించారు. మనం నాగరిక సమాజంలో ఉన్నామా? అనాగరిక సమాజంలో ఉన్నామా? అని ప్రశ్నించారు. ప్రశ్నించేవారిని హిందుత్వ శక్తులు మట్టుబెడుతున్న తీరుపట్ల ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి ధోరణి దేశానికే ప్రమాదకరమని హెచ్చరించారు.

ఆయుధాల వ్యాపారం కోసమే యుద్ధాలు

రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్-పాలస్తీనా మధ్య ఏళ్ల తరబడి, తాజాగా ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య యుద్ధాలు కొనసాగుతున్నాయనీ, ప్రపంచవ్యాప్తంగానూ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయని దేవరాజు మహారాజు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆయుధ వ్యాపారాల విస్తరణ కోసం అమెరికా లాంటి దేశాలు యుద్ధాలను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. కూర్చొని శాంతిమార్గంలో సమస్యలను పరిష్కరించుకునే అవకాశమున్నా ఇలా చేయడం ప్రపంచానికి మంచిది కాదని హితవు పలికారు. పెహల్గాంలో ఉగ్రదాడి ఎందుకు జరిగింది? ప్రధాని మోడీకి చెప్పుకోండి అని ఉగ్రవాదులు అనడమేంటి? అంతకు ముందే అక్కడ మిలిటరీ బేస్ క్యాంపు ఎందుకు ఎత్తేశారు? ఇంటిలిజెన్స్ వ్యవస్థ ఎందుకు పసిగట్టలేకపోయింది? ఇప్పటి వరకూ ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేకపోయింది? వీటన్నింటికీ మోడీ సర్కారు సమాధానాలు చెప్పాలన్నారు. ప్రశ్నించేవారిని తప్పుబట్టడం సరిగాదన్నారు.



అంబర్‌పేట బోనాల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆషాడ మాసం చివరి వారం నిర్వహించే అంబర్‌పేట మహంకాళీ అమ్మవారి బోనాల ఏర్పాట్లపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆదివారం ధృవ ఎలైట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బోనాల నిర్వహణపై పలు అంశాలు చర్చించారు. కమిటీ సభ్యులనుద్దేశించి దేవస్థాన కమిటీ అడ్వయిజర్ దుర్గాప్రసాద్ రెడ్డి మాట్లాడారు. బోనాలు సమర్పించేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కమిటీ సభ్యుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించి బోనాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంజాల గిరిధర్ గౌడ్, రంగంపల్లి రాజు, చెంగలి సుధాకర్, గడ్డం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిగూడలో పార్కు ఆక్రమణలను తొలగించిన హైడ్రా

- 60 ఏళ్ల పోరాట ఫలితమంటూ స్థానికుల హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మధురానగర్ మెట్రో రైల్వే స్టేషన్ సమీపంలోని ఎల్లారెడ్డిగూడలోని పార్క్ స్థలంలో ఆక్రమణలను హైడ్రా అధికారులు ఆదివారం తొలగించారు. మొత్తం 1533 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలాన్ని స్వాధీనం చేసుకొని "ప్రొటెక్టెడ్ బై హైడ్రా" బోర్డు ఏర్పాటు చేశారు. 1961లో ఏర్పాటు చేసిన సాయి సారధినగర్ లేఅవుట్‌లో 5 ఎకరాల విస్తీర్ణంలో 35 ప్లాట్లను రూపొందించగా, అందులో ఒక భాగాన్ని పార్కుగా చూపించారు. అయితే, నారాయణ ప్రసాద్ వారసులు స్థలాన్ని ఆక్రమించి షెడ్లు వేసి ఇంటి నంబర్ పొందినట్టు విచారణలో వెల్లడైంది. పార్క్ ఖాళీ చేయకపోవడంపై స్థానికులు పలుమార్లు జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో చివరికి హైడ్రా దృష్టికి తీసుకువచ్చారు. సాయి సారధినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు వివిధ శాఖలతో కలసి సమగ్ర విచారణ జరిపారు. దీనిలో భాగంగా అక్రమ నిర్మాణాలను తొలగించారు. 60 ఏండ్లుగా న్యాయం కోసం పోరాడుతున్న స్థానికులు దీనిపై హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

4న పిఎసి సమావేశం

- అదే రోజు గ్రామస్థాయి నేతలతో బహిరంగసభ
- టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశం జూలై 4న గాంధీభవన్‌లో జరుగుతుందని టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పిఎసి సమావేశం అనంతరం పిసిసి విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఎల్‌బి స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో భహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కమిటీ మీటింగ్‌లో బాగంగా నిర్వహిస్తున్న ఈ సభకు 15 వేల మంది హాజరుకానున్నారని తెలిపారు. వరంగల్ నేతలు వ్యవహారాలలో క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. జీవితాంతం లౌకికవాదిగా బతికి బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను ఒప్పుకోని డిఎస్ విగ్రహాన్ని బిజెపి నాయకునితో ఆవిష్కరిస్తే ఆయన ఆత్మ క్షోభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డిఎస్ విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించిందనీ, అయినా కాంగ్రెస్ నాయకులెవరికీ ఆహ్వానం లేదని తెలిపారు. డిఎస్ ఏనాడు బిజెపిలో లేరని, కొన్ని కారణాల వల్ల ఆయన బిఆర్ఎస్‌లో చేరారని గుర్తుచేశారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గానికి ఎప్పుడు ఉప ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తిస్తామని తెలిపారు. మాజీ మంత్రి, దివగంత నేత ముఖేష్ గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కొత్తగా నియమించబడిన టిపిసిసి ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు పని విభజన చేస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు.

తెలంగాణ జాగృతి ఎన్ఆర్ఐ అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ జాగృతి వివిధ దేశాల శాఖలకు నూతన అధ్యక్షులను ఆ సంస్థ అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం జాగృతి ప్రధాన కార్యదర్శి రంగు నవీన్ ఆచారి ఒక ప్రకటన విడుదల చేశారు. న్యూజిలాండ్ అధ్యక్షులుగా అరుణ జ్యోతి ముద్దం, గల్ఫ్ అధ్యక్షులుగా చెల్లంశెట్టి హరిప్రసాద్, ఖతర్ అధ్యక్షులుగా మూకల ప్రవీణలక్ష్మి, సలహాదారుగా నందిని అబ్బగోని, యూఎఈ అధ్యక్షులుగా పీచర వేంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శిగా శేఖర్‌గౌడ్, కువైట్ అధ్యక్షులుగా మర్క ప్రమోద్ కుమార్, సౌదీ అరేబియా అధ్యక్షులుగా మహమ్మద్ మొజ్జం అలీ ఇఫ్తెకార్, ఒమన్ అధ్యక్షులుగా గుండు రాజేందర్ నేతలను ప్రకటించారు. అలాగే యునైటెడ్ కింగ్ డమ్ అధ్యక్షులుగా సుమన్ రావు బల్మూరి, ఇటలీ అధ్యక్షులుగా తానింకి కిశోర్ యాదవ్, ఫిన్లాండ్‌కు ఐరెడ్డి సందీప్‌రెడ్డి, పోర్చుగల్‌కు ప్రకాశ్ పొన్నకంటి, మాల్టాకు పింటు ఘోష్, కెన్యా అధ్యక్షులుగా స్వప్నరెడ్డి గంట్ల, ఇరాక్ కుర్దిస్తాన్‌కు మహ్మద్ సల్మాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా నాయక్వార్ రాంచందర్ వ్యవహరిస్తారని ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మహారాష్ట్ర అధ్యక్షులుగా శ్రీనివాస్ సూలేను నియమించినట్టు పేర్కొన్నారు. నియామకాలన్నీ వెంటనే అమల్లోకి వస్తాయని తెలిపారు. త్వరలోనే ఆయా దేశాల్లో పూర్తి స్థాయి కమిటీలను ప్రకటిస్తామని వెల్లడించారు.

ఉగ్రవాదులను అరికట్టడంలో మోడీ ప్రభుత్వం విఫలం

కేంద్రం భద్రతా వైఫల్యంతోనే బాలాకోట్, పుల్వామా, పహల్గాం దాడులు : ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉగ్రవాదులను అరికట్టడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భద్రతా వైఫల్యం కారణంగానే 2016లో బాలాకోట్, 2019లో పుల్వామా, ఇటీవల పహల్గాంలో దాడులు జరిగాయని చెప్పారు. సిపిఎం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కమలానగర్‌లోని పార్టీ జిల్లా కార్యాయలంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి శ్రీనివాసులు అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గాంలో పర్యాటకుల మీద ఉగ్రవాదులు దాడి చేసి 26 మంది పర్యాటకులను చంపేయడానికి కారణం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భద్రతా వైఫల్యమేనని అన్నారు. ఉగ్రవాదులు దాడి చేస్తున్నప్పుడు అక్కడ గుర్రం నడిపే ఓ ముస్లిం, పర్యాటకులను రక్షించే క్రమంలో ప్రాణాలు కోల్పోయాడని, ఈ ఉగ్ర దాడిని యావత్ భారతదేశంతోపాటు జమ్మూ కశ్మీర్ ప్రజలు సైతం తీవ్రంగా ఖండించారని తెలిపారు. పహల్గాం దాడిలో పేరు, మతం అడిగి చంపేశారని అన్నారని, సిపిఎం నాయకత్వం కశ్మీర్‌లో పర్యటించి, గుర్రం నడిపే ముస్లిం యువకుడి ఇంటికెళ్లి వారి తండ్రిని పరామర్శించినప్పుడు ఉగ్రవాదులు దాడి చేసింది పర్యాటకుల మీద కాదు, కశ్మీరుల గుండెల్లో కాల్చారని చెప్పినట్టు తెలిపారు. ఒక ముస్లిం యువకుడు ఆ దాడిలో బిజెపి నాయకుని కూతురును రక్షించాడనీ, తర్వాత ఆమె తనకు కశ్మీర్‌లో ఇద్దరు అన్నయ్యలు దొరికారనని చెప్పినట్టు చెప్పారు. కేంద్రం ఇప్పటి వరకు పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదుల్ని పట్టుకోలేకపోయిందని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్రవాద కేంద్రాల మీద దాడి చేసి చంపేశారనీ, పుల్వామా దాడి తర్వాత పాకిస్తాన్ మీద సర్జికల్ స్ట్రైక్ చేసి ఉగ్రవాదులను ఏరి పారేసామని అన్నారని గుర్తు చేశారు. పెద్ద నోట్ల రద్దు ఉగ్రవాదులకు అందుబాటులో లేకుండా చేయటమేనని చెప్పారన్నారు. ఆర్టికల్ 357 రద్దు కూడా ఉగ్రవాదుల్ని అంతం చేయడానికేనని చెప్పారని తెలిపారు. కశ్మీర్‌లో ఉగ్రవాదుల్లేకుండా చేశామని మోడీ, అమిత్ షా ప్రకటించిన 10 రోజులకే అక్కడ ఉగ్రదాడి జరిగిందన్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత అక్కడి పర్యాటకులను అక్కడ టాక్సీ వాలాలో ఉచితంగా వారి గమ్యస్థానాలు చేర్చితే, విమానయాన సంస్థ మాత్రం అధిక రేట్లు పెంచి పర్యాటకులను దోచుకుందని చెప్పారు. రాఫెల్ యుద్ధ విమానాన్ని పాకిస్తాన్ కూల్చేసిందని ద వైర్ పత్రిక భారత ప్రజానీకానికి తెలిపితే, ఆ పత్రికను బ్యాన్ చేశారని అన్నారు. కాల్పుల విరమణను పాకిస్తాన్ గానీ, భారత్‌గానీ ప్రకటించలేదనీ, అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రకటించారని చెప్పారు. దీనికి అర్థం సామ్రాజ్యవాద దేశమైన అమెరికా.. మన దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమేనని అన్నారు. ట్రంప్ జోక్యం చేసుకుంటే మోడీ ఇప్పటి వరకు తమ దేశం గురించి నీకెందుకు..? నీకేం సంబంధం..? అని అడగలేదన్నారు. ఇంత జరిగినా ప్రపంచ బ్యాంకు ఐఎంఎఫ్ మన దేశం వద్దని చెప్పినా.. పెద్ద ఎత్తున పాకిస్తాన్‌కు ఆర్థిక సాయం చేసిందని తెలిపారు. చిన్న దేశం ఇరాన్ అమెరికాను భయపెడితే, మన దేశం మాత్రం అమెరికాకు సలాం కొడుతున్నదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం జమ్మూ కశ్మీర్ ప్రజలకు భద్రతా విషయంలో అండగా ఉంటామని హామీనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.శ్రీనివాసులు, కోమటి రవి, ఎ.అశోక్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ఉద్యమాలతోనే హక్కులు సాధ్యం

- గిరిజన గూడాలపై అటవీశాఖ దాడులు అమానుషం : మాజీ ఎంపి మిడియం
- ములుగులో "జిఓ-3 ప్రత్యామ్నాయం, ఎస్‌టిల వర్గీకరణ ఆవశ్యకత"పై సెమినార్

ప్రజావక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యమాలతోనే ఆదివాసీ గిరిజనుల హక్కులు సాధింపబడతాయని మాజీ ఎంపి మిడియం బాబురావు అన్నారు. ఆదివారం ములుగు జిల్లా ఏటూర్‌నాగారం మండలకేంద్రంలోని జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు అధ్యక్షతన 'జీఓ-3 ప్రత్యామ్నాయం, ఎస్టీల వర్గీకరణ ఆవశ్యకత' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ ఏరియాలో అన్ని ఉద్యోగాలు ఆదివాసీలకే దక్కాలంటే అది కేవలం ఉద్యమాల ద్వారానే సాధ్యమన్నారు. జీఓ-3ను సుప్రీం కోర్టు మైదాన ప్రాంత ప్రజలతో సమానంగా చూస్తూ షెడ్యూల్ ఏరియాలో ఉన్న వాళ్లతో పోలుస్తూ కొట్టివేయడం సరైనది కాదన్నారు. జిఓ-3కి ప్రత్యామ్నాయంగా 5వ షెడ్యూల్ ఏరియాలో అన్ని ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీల వర్గీకరణ జరిగితే లాభనష్టాలపై అందరూ ఆలోచన చేయాలన్నారు. అనంతనం రొయ్యూర్ పరిధి కొమురంభీం కోయగిరిజన గ్రామంలో ఇటీవల అటవీశాఖ అధికారులు దాడులు చేసి బీభత్సం సృష్టించిన విషయంపై సిపిఎం రాష్ట్ర నాయకులతో కలిసి ఆ గూడెంను సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మిడియం బాబురావు మాట్లాడుతూ కొన్నేండ్లుగా నివాసం ఉంటున్న గిరిజన గుడాలపై ముందస్తుగా ఎలాంటి సమాచారం లేకుండా దాడులు చేయడం దుర్మార్గమన్నారు. గిరిజనులకు ఎక్కడైనా నివసించే హక్కు ఉందన్నారు. గిరిజనులు పూర్తిస్థాయిలో హక్కులు సాధించుకునే అంతవరకు పోరాడాలన్నారు ఈ పోరాటానికి తాము వెన్ను దన్నుగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దుగ్గి చిరంజీవి, దామోదర్, టిఎస్‌యుటిఎఫ్ ములుగు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పొడెం సమ్మయ్య, రెడ్డి వాసుదేవ రెడ్డి, జిల్లా నాయకులు వెంకటస్వామి, కొండ చెంచయ్య, ఎటిఎం జిల్లా అధ్యక్షులు మహిపతి సంతోష్, డీటీఎఫ్ నాయకులు రేగ నరేంద్ర కుమార్, టిడబ్ల్యుటియు నాయకులు పోదెం కృష్ణప్రసాద్, తుడుందెబ్బ నాయకులు పోడెం బాబు, ఆదివాసీ నాయకులు మడి సాయిబాబా, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు చిరంజీవి, గొంది రాజేష్, మన్య సీమ రాష్ట్ర సమితి నాయకులు గొప్ప వీరయ్య, పెసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు కొప్పుల రవి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

వైద్యవిద్యార్థుల ఉపకార వేతనాల పెంపు

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్య విద్యార్థుల ఉపకారవేతనాలు 15 శాతం మేరకు పెరిగాయి. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్, డెంటల్ స్టూడెంట్స్‌తో పాటు, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనం పెరిగింది. పెరిగిన ఉపకారవేతనం, గౌరవ వేతనం 2025 జనవరి 1 నుంచి వర్తిస్తుందని ఆ ఉత్తర్వులో స్పష్టం చేశారు.

పెంపునకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పిజి డాక్టర్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.67,032, సెకండ్ ఇయర్‌లో రూ.70,757, ఫైనల్ ఇయర్‌లో రూ.74,482 చొప్పున స్టైఫండ్ అందనుంది. సూపర్ స్పెషాలిటీ స్టూడెంట్లకు ఫస్ట్ ఇయర్‌లో రూ.1,06,461, సెకండ్ ఇయర్‌లో రూ.1,11,785, థర్డ్ ఇయర్‌లో రూ.1,17,103 చొప్పున స్టైఫండ్ అందనుంది. సీనియర్ రెసిడెంట్లకు డాక్టర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.92,575నుంచిరూ.1,06,461 పెంచుతున్నట్టు జిఒలో పేర్కొన్నారు. హౌస్ సర్జన్ చేస్తున్న మెడికల్, డెంటల్ విద్యార్థులకు రూ.29,792 ఇవ్వనున్నారు. అదే విధంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో మొదటి సంవత్సరం విద్యార్థుల స్టైఫండ్‌ను రూ.67,032కు, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల స్టైఫండ్ ను రూ.70,757కు పెంచారు.

16,448 మంది సర్వీసుల పొడిగింపు

రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 16,448 మంది ఉద్యోగుల సర్వీసులను మరో ఏడాది పొడిగించారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు వీరి సర్వీసులను పొడిగిస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పోస్టుల్లో 4,772 కాంట్రాక్ట్, 8,615 అవుట్ సోర్సింగ్, 3,056 పోస్టులు పారితోషికం ప్రాతిపదికన, ఐదు పోస్టులు మల్టీ టాస్కింగ్ స్టాఫ్ కు సంబంధించినవి ఉన్నాయి. ఈ పోస్టులు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, బోధనాస్పత్రులు, నర్సింగ్, డెంటల్ కాలేజీలకు చెందినవి. ఆయా పోస్టుల్లో ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ వంటి బోధనా సిబ్బందితో పాటు డాక్టర్లు, నర్సింగ్ ఆఫీసర్లు, పారామెడికల్ సిబ్బంది, డిఇఒలు, క్లాస్ 4తో ఇతర విధులు నిర్వహించే వివిధ క్యాడర్ల వారున్నారు. రెగ్యులర్ నియామకం జరిగేంత వరకు సిబ్బంది కొరత రాకుండా ఉండేందుకు ఈ పొడిగింపు చేపట్టినట్టు ఉత్తర్వులో వివరించారు.

మహంకాళి బోనాల జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- గోల్కొండ బోనాల జాతరను పర్యవేక్షించిన దేవాదాయశాఖ కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహంకాళి బోనాల జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాల్లో భాగంగా ఘటాల ఎదుర్కోళ్ల సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటాలకు అలంకరించే ఆభరణాలను ట్రస్ట్ సభ్యులకు మంత్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26న గోల్కొండ బోనాలతో ఆషాఢ మాస బోనాలు ప్రారంభమయ్యాయనీ, జంట నగరాల్లో బోనాల ఉత్సవాలు ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారని తెలిపారు. బోనాల జాతరలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జులై 1న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం జరుగుతుందని, 13న ఉజ్జయిని మహంకాళి బోనాలు, 14న రంగం భవిష్యవాణి, 20న లాల్ దర్వాజా సింహవాహిని బోనాలు జరుగుతాయని తెలిపారు. అంతకుముందు ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి వెంట రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు కోట నీలిమ, ఆలయ ఈవో మనోహర్ రెడ్డి, ట్రస్టీ కామేష్ ఉన్నారు.


ఆభరణాలను ట్రస్ట్ సభ్యులకు అందజేస్తున్న మంత్రి

వైభవంగా గోల్కొండ మహంకాళి అమ్మవారి జాతర

గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పుర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రభుత్వం ఆషాఢ బోనాల ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ అన్ని శాఖల అధికారులకు సమన్వయపరుస్తూ జాతరలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు, పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తూ భక్తులకు పూర్తిస్థాయిలో సహకారాన్ని అందించారు. ఆషాడమాసం తొలి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. కోటపైన భక్తుల రద్దీని నిరంతరం పర్యవేక్షిస్తూ.. తొక్కిసలాటకు అవకాశం లేకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. పోలీస్ పాయింట్స్‌తోపాటు జూబ్లీహిల్స్ పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం నిఘా పెట్టారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. జాతరలో విదేశీయులు రావటం ఆకర్షణగా నిలిచింది. భక్తులు అధిక సంఖ్యలో ఉండే క్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు ఏర్పాట్లను పరిశీలించారు. మెడికల్ స్టాల్‌ను సందర్శించి భక్తులకు అందుతున్న వైద్య సదుపాయాలు అలాగే హెచ్ఎండీఏ ఏర్పాటుచేసిన తాగునీటి స్టాల్స్‌ను పరిశీలించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పోలీసులకు కమిషనర్ సూచించారు

నిర్బంధ అరెస్టులను ఖండించండి

- పెండింగ్ రైల్వే లైన్లకు కేంద్రం నుంచి పైసా తేని ఎంపి ధర్మపురి అరవింద్
- సిపిఎం, ఇతర వామపక్ష నేతల గృహనిర్బంధం, అరెస్టులు
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే : బుర్రి ప్రసాద్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభానికి వచ్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పర్యటన సందర్భంగా సిపిఎం నేతలతో పాటు ఇతర వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను అర్ధరాత్రి నుంచి ఇళ్ల మీద పడి అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్లలో బంధించడం ప్రజాస్వామ్యాన్ని, పౌర హక్కులను అవహేళన చేయడమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ అన్నారు. అరెస్ట్ చేసిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్ షా పర్యటన నేపథ్యంలో అర్ధరాత్రి నుంచి సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీనియర్ నాయకులు పెద్ది వెంకట్రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు నూర్జహాన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శంకర్‌గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు ఏశాల గంగాధర్, నగర కమిటీ సభ్యులు రాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్‌తో పాటు ఇతర వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేశారన్నారు. ఎలాంటి నిరసనలకు పిలుపివ్వకపోయినా పోలీసులు.. అర్ధరాత్రి నాయకుల ఇండ్ల, పార్టీ కార్యాలయాల మీద దాడి చేసి భయభ్రాంతులకు గురిచేయడం, కనీస అవసరాలకు బయటకు రాకుండా గృహనిర్బంధం చేయడం మానవ హక్కులను ఉల్లంఘించడమేనని అన్నారు. జిల్లా ప్రజలకు అనేక వాగ్దానాలిచ్చి బీజేపీ ఎంపీగా గెలిచిన ధర్మపురి అరవింద్ వాటిని మర్చిపోయారని ఆరోపించారు. తాను గెలవగానే నిజాంషుగర్ ఫ్యాక్టరీని తిరిగి ఓపెన్ చేస్తానని చెప్పిన మాట నేటికీ నెరవేర్చలేదన్నారు. ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్ రైల్వే లైన్, నిజామాబాద్ నుంచి ఆదిలాబాద్ డబుల్ రైల్వే లైన్, బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వేలైన్, నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వరకు డబుల్ రైల్వే లైన్ ప్రతిపాదనలతో పాటు భూసేకరణ జరిగినా.. నేటికీ దానికి సంబంధించిన నిధులను రాబట్టలేకపోయారని విమర్శించారు. ఆర్మూర్ నియోజకవర్గంలో లక్కంపల్లి సెజ్ కోసం 500 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించిన ప్రభుత్వం ఉపాధి కల్పన కోసం ఒక్క పరిశ్రమనూ తీసుకురాకపోవడం ఎంపీ చేతగానితనానికి నిదర్శనమన్నారు. జక్రాన్‌పల్లి వద్ద నిర్మాణం కోసం భూములను సేకరించి సంవత్సరాలు గడుస్తున్నా కేంద్రాన్ని ఒప్పించి అంతర్గత రాష్ట్రాల విమానాశ్రయాన్ని నిర్మాణం చేయడానికి నిధులు తీసుకరాకపోవడం చూస్తే ఈ జిల్లా అభివృద్ధికి ఎంపీ అరవింద్ పెద్ద ఆటంకంగా ఉన్నారనేది అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా ఎంపీ అరవింద్, కేంద్రమంత్రి అమిత్ షాకు చిత్తశుద్ధి ఉంటే ఈ పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేష్, నాగన్న, జిల్లా నాయకులు నన్నేసాబ్, జంగం గంగాధర్, కొండ గంగాధర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత రావి శ్రీనివాస్ పార్టీ నుంచి సస్పెండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్‌పై సస్పెన్షన్ వేటు పడింది. శ్రీనివాస్‌ను ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్టు టిపిసిసి క్రమశిక్షణ కమిటీ ఆదివారం ప్రకటించింది. రావి శ్రీనివాస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కపై విమర్శలు చేశారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షుడు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన పిసిసి క్రమశిక్షణ చర్య కమిటీ (డిఎస్‌సి) చైర్మన్ చిన్నారెడ్డి షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 28వ తేదీలోపు వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో పార్టీ నియమావళిని అనుసరించి చర్యలుంటాయని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. రావి శ్రీనివాస్ నుంచి సరైన వివరణ రాకపోవడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు.

మీడియా ముసుగులో బిఆర్ఎస్‌పై దుష్ప్రచారం

- మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియా ముసుగులో కొన్ని సంస్థలు బిఆర్ఎస్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓ న్యూస్ చానల్ బిఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై అసత్య ప్రచారాలు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నేతలు దాన్ని సమర్థించడాన్ని ఆయన తప్పు పట్టారు. మీడియా హద్దులు దాటి వ్యక్తిగత విషయాలపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో హింసకు తావు లేకుండా పార్టీని నడిపించామని గుర్తు చేశారు. ఎపి సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకే సదరు మీడియా సంస్థ వ్యవహరిస్తోందని ఆరోపించారు. మీడియా పట్ల బిఆర్ఎస్ పార్టీకి గౌరవం ఉందని, అదే సమయంలో అవాస్తవాలు ప్రచారం చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా పని చేసిన వాళ్లంతా ఏకమై బిఆర్ఎస్‌పై విషం చిమ్ముతున్నారని మాజీ ఎమ్మెల్యే చంటి కిరణ్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పల్లె రవికుమార్ గౌడ్, గజ్జెల నగేశ పాల్గొన్నారు.

ప్రభుత్వ కుట్రలో పోలీసులు పావులు కావొద్దు

- ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పోలీసులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే అక్రమ ఆదేశాలను పాటించి ప్రభుత్వ కుట్రల్లో పావులుగా మారొద్దని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో సీఎం బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ తీరుతో రాష్ట్రంలో అంతర్గత శాంతి భద్రతలకు భంగం కలిగే ప్రమాదముందని హెచ్చరించారు. ట్యాపింగ్ కేసును సిట్ అధికారులు విచారణ చేస్తున్నారా? గాంధీ భవన్‌లో ఉన్న కాంగ్రెస్ నాయకులు విచారణ చేస్తున్నారా? తెలియని పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. పోలీసులకు తెలియని విషయాలు ముందుగా వారికెలా తెలుస్తున్నాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చే చవకబారు లీకుల ఆధారంగా బీఆర్ఎస్ నేతలపై మీడియా దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు. అభిమాన నాయకులపై ఫేక్ ప్రచారాలు చేయడాన్ని తట్టుకోలేక ప్రజలు దాడి చేశారనీ, దానికి ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశం పూర్తిగా పోలీసు శాఖకు సంబంధించిన విషయమనీ, ,రాజకీయాలకు సంబంధం లేదని స్పష్టం చేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన బిఆర్ఎస్‌వి నాయకులు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌కు ఎటిఎంలా తెలంగాణ

పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభోత్సవంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పనుల్లో కమీషన్ దందా నడిపిందని, కాళేశ్వరం పనుల్లో అనేక అవకతవకలకు పాల్పడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారిపై ఏమైనా చర్యలు తీసుకుందా అనికేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రశ్నించారు. తెలంగాణను గతంలో కెసిఆర్ కుటుంబం ఎటిఎంగా వాడుకుందని.. ప్రస్తుతం కాంగ్రెస్.. ఢిల్లీకి ఎటిఎంగా వాడుకుంటుందని ఆరోపించారు.

వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపికి అవకాశం ఇవ్వాలని కోరారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జాతీయ పసుపుబోర్డు కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు సమ్మేళనం సభలో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల పసుపు రైతుల కలను సాకారం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మోడీ ఏదైతే చెప్తారో అది ఆచరణలో చేసి చూపిస్తారని వెల్లడించారు. అధిక విస్తీర్ణంలో పసుపు పండించే నిజామాబాద్ జిల్లాలో బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు, ఇదే జిల్లాకు చెందిన రైతుబిడ్డ పల్లె గంగారెడ్డిని బోర్డు చైర్మన్‌గా నియమించామని తెలిపారు. పసుపు బోర్డుతో పాటు భారత్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, ఆర్గానికి లిమిటెడ్ బ్రాంచ్‌లు సైతం ఇక్కడే ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అమెరికా, కెనడా, యూరప్ లాంటి ప్రపంచ దేశాలకు పసుపును ఎగుమతులు చేసి రైతుల ఆదాయం పెంచుతామని హామీ ఇచ్చారు.

'మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి జనజీవన స్రవంతిలో కలవాలి. సరెండర్ అయ్యేవారుంటే అవ్వండి. లేకుంటే 2026 వరకు మేమే నక్సలిజాన్ని అంతమొందిస్తాం. ఆయుధాలు పట్టుకున్న వారితో ఎట్టి పరిస్థితుల్లో చర్చల్లేవ్' అని అమిత్ షా అన్నారు. 2014 కంటే ముందు ఉగ్రవాదులు దేశంలోని చొరబడి మనవారిని కాల్చి వెళ్లిపోతుండేవారని. కానీ ఎవరూ స్పందించేవారు కాదని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక ఉగ్రదాడులకు దీటైన జవాబు ఇస్తున్నామని తెలిపారు. వారు 'ఉరి'లో అటాక్ చేస్తే సర్జికల్ స్ట్రైక్ చేశామని, పుల్వామాలో దాడి చేస్తే ఎయిర్‌స్ట్రైక్‌తో, పహల్గాంలో దాడి చేస్తే ఆపరేషన్ సిందూర్‌తో నేరుగా ఉగ్రస్థావరాలనే మట్టుబెట్టామని తెలిపారు.

దాంతో మన బలమెంతో పాకిస్తాన్‌కు, ప్రపంచానికి తెలిసిందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక సురక్షిత భారత్ కోసం సంకల్పించారని, అందుకే అటు ఉగ్రవాదంతో పాటు నక్సలిజాన్ని అంతం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు పది వేల మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్‌రెడ్డి, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పసుపు బోర్డు వైస్ చైర్మన్ భవాని, ఇతర ఉన్నతాధికారులు, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.



పసుపుబోర్డు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా

నామమాత్రమే 'ఎన్నిక'..

- బిజెపి రాష్ట్ర అధ్యక్ష, జాతీయ కౌన్సిల్ పదవులకు నోటిఫికేషన్ విడుదల
- నేడు దరఖాస్తుల స్వీకరణ, ఉపసంహరణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పేరుకే ఎన్నిక నోటిఫికేషన్. అదీ నామమాత్రమే. ముందే జాతీయ నాయకత్వం ఎంపిక చేసిన పోస్టులకు అదో తంతు. ఇదీ బిజెపి నేతలు చెప్పే ప్రజాస్వామ్య పద్ధతిలో అధ్యక్షుని ఎన్నిక తీరు బిజెపి రాష్ట్ర అధ్యక్ష, జాతీయ కౌన్సిల్ పదవుల పోటీ కోసం నోటిఫికేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఆదివారం సాయంత్రం విడుదల చేశారు. ఆ ప్రకటనలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. అదే సమయంలో నామినేషన్ల ఉపసంహరణ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ఉంటుందని వెల్లడించారు. ఈ నోటిఫికేషన్ మొక్కుబడిగా ఉందనే విమర్శ వెల్లువెత్తుతున్నది. ఎక్కడైనా ఒక ఎన్నిక నోటిఫికేషన్ విడుదలైతే నామిషనేషన్ల ప్రక్రియకు మూడు, నాలుగు రోజుల వ్యవధి ఉంటుంది. ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు వేసినప్పటికీ పోటీ నుంచి తప్పుకునే అవకాశం కూడా ఉంటుంది. అభ్యర్థులు పునరాలోచించుకోవడానికీ, తన అనుయాయులతో చర్చించి నిర్ణయం తీసుకోవడానికి, బుజ్జగింపుల పర్వానికి కనీసం ఒక్కరోజైనా గడువు ఉంటుంది. కానీ, బిజెపి ఎన్నికల నోటిఫికేషన్‌లో అది ఎక్కడా కనిపించలేదు. నోటిఫికేషన్‌ను ఆదివారం సాయంత్రమే విడుదల చేసింది. సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకే స్వీకరణ ఉంటుందని స్పష్టం చేసింది. నామినేషన్ వేసిన గంటలోనే అనాసక్తి గలవారు ఉపసంహరించుకోవడానికి అవకాశమిచ్చింది. ఆసక్తితో నామినేషన్ వేసేవారి నిర్ణయం గంటలోనే ఎలా మారుతుంది? కనీసం వారు ఆలోచించుకోవడానికి సమయం ఇవ్వాలి కదా? ప్రజాస్వామ్య పద్ధతి అంటే ఇదేనా? 'ఎన్నిక' అనేది ఒట్టిమాటేనా? జాతీయ నాయకత్వం ఎంపికే తుది నిర్ణయమా? అన్న ధర్మసందేహాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తపరుస్తున్నారు.

కెసిఆర్, కెటిఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదు

- పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో: ఓ మీడియా ఛానల్‌పై బిఆర్ఎస్ శ్రేణుల దాడిని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ ఖండించారు. కేసీఆర్, కేటీఆర్‌కు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదన్నారు. సినీతారల ఫోన్ ట్యాపింగ్ ఎందుకు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. దీంతో వారి కుటుంబాల్లో చిచ్చు పెట్టారని ఆరోపించారు. సినీ తారలు, జడ్జిలు, మహిళా అధికారుల ఫోన్ ట్యాప్ చేశారన్నారు. వాళ్ల టార్గెట్ నేతలు అయితే వారి ఇంట్లో మహిళల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేశారని నిలదీశారు. ఏదైనా అభ్యంతరం ఉంటే న్యాయపరంగా ముందుకెళ్లాలన్నారు.

పట్టా భూమి తీసుకుని.. అసైన్డ్ భూమి కట్టబెట్టిన అధికారులు

- భూమిని అమ్ముకోలేని పరిస్థితిలో సంగయ్య, రాములు కుటుంబాలు
- మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న నాగమణి భర్త
- పొరపాట్లను సరి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ ప్రయోజనాల కోసం తమ పట్టా భూమిని ఇచ్చిన రైతుల్ని అధికారులు నమ్మబలికి నట్టేట ముంచారు. ఆనాటి రెవెన్యూ అధికారులు చేసిన మోసానికి రెండు నిరుపేద రైతు కుటుంబాలు తీవ్ర మనోవేదన అనుభవిస్తున్నాయి. తమ కూతుళ్ల పెళ్లిళ్ల, ఇతర అవసరాల కోసం గుంట భూమిని కూడా అమ్ముకోలేని పరిస్థితికి నెలకొంది. తమకిచ్చిన భూమికి అసైన్డ్ చేసినట్టు కాకుండా పట్టా చేసినట్టుగా రికార్డుల్లో మార్పులు చేయాలని బాధిత కుటుంబాలు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల కేంద్రానికి చెందిన చీలమామిడి సంగయ్య, గవినికాడి రాములు అనే చిన్న కారు రైతులకు 7.18 ఎకరాల పట్టా రిజిస్ట్రేషన్ భూమి ఉంది. ఆ భూమిని 1989-90 సంవత్సరంలో మునిపల్లి మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు నిమిత్తం ఇవ్వాలని రైతుల్ని అధికారులు సంప్రదించారు. అందుకు రైతులు అంగీకరించారు. రైతుల భూమికి బదులుగా సర్వే నెంబర్ 307లోని పది ఎకరాల ప్రభుత్వ భూమిని ఇచ్చారు. అయితే అధికారులు గమ్మత్తుగా రైతుల్ని మోసం చేశారు. అదనపు భూమి ఇస్తున్నామని చెప్పి భూమి బదలాయింపుల్లో మాత్రం చిక్కులు పెట్టారు. సంగయ్య, రాములుకు ఇస్తామని చెప్పిన పది ఎకరాల భూమి ప్రభుత్వ భూమి కావడంతో అసైన్డ్ చేసినట్టుగా మంజూరు ఇచ్చారు.



భూమి పత్రాలు పట్టుకొని అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు

అసైన్డ్ భూమి కావడంతో క్రయవిక్రయాలు చెల్లవు

అసైన్డ్ భూముల్ని అమ్మినా కొనుగోలు చేసినా చట్ట రిత్యా చెల్లదు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులు దాచిపెట్టారు. సంగయ్య తదనంతరం ఆయన కుమార్తె యాదమ్మ పేరిట మారింది. అదే విధంగా గవునికాడి రాములు భూమిని తన కూతురు నాగమణికి కట్నం కింద ఎకరం భూమి ఇచ్చారు. యాదమ్మ, నాగమణి ఇద్దరు కూడా తమ కూతుళ్ల పెళ్లిళ్ల చేయాలని తమకు వారసత్వంగా వచ్చిన భూమిని అమ్ముకునేందుకు సిద్ధపడ్డారు. కొనేందుకు వచ్చిన వారు భూమికి సంబంధించిన రికార్డుల్ని పరిశీలించగా ఆ భూమి అసైన్డ్ చేయడం ద్వారా సంక్రమించినట్టుగా ఉండడంతో కొనుగోలు చేయకుండా వెళ్లిపోయారు. దీంతో మనస్తాపానికి గురైన నాగమణి భర్త ఇటీవల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

కలెక్టర్‌కు మొరపెట్టుకున్న బాధిత మహిళలు

అసైన్డ్ చేయబడినట్టుగా అధికారులు రికార్డుల్లో పేర్కొనడం వల్ల తీవ్రంగా నష్టపోయిన యాదమ్మ, నాగమణి గత కలెక్టర్ క్రాంతి వల్లూరుకు మొరపెట్టుకున్నారు. మునిపల్లి మండల కేంద్ర పర్యటనకు కలెక్టర్ వచ్చిన సందర్భంగా ఇద్దరు మహిళలు తమ భూమి సమస్య గురించి కలెక్టర్‌కు విన్నవించారు. తమకిచ్చిన భూమికి అసైన్‌మెంట్ పట్టా భూమిని పట్టాదారు భూమిగా మార్పులు చేసి ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ అధికారులెవ్వరూ పట్టించుకోలేదు. ఇటీవల జరిగిన భూ భారతి సదస్సుల్లోనూ యాదమ్మ, నాగమణి ఇద్దరూ కూడా తమ భూమిని పట్టా భూమిగా మార్పు చేయాలని కోరుతూ అర్జీ పెట్టారు.

పొరపాట్లను సరిద్దిద్దాలి: రమేష్ గౌడ్, సిపిఎం

పట్టాదారు పాసు పుస్తకం ఉన్న భూమిని తీసుకుని అసైన్‌మెంట్ భూమిని కేటాయించి మోసం చేసిన రెవెన్యూ అధికారులే పొరపాట్లను సరిద్దిద్దాలని సిపిఎం సదాశివపేట ఏరియా కమిటీ నాయకులు రమేష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇద్దరు మహిళలు తమకున్న భూమిలో కొంత అమ్ముకుంటే తప్ప తమ కూతుళ్ల వివాహాలు చేయలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్లు జోక్యం చేసుకుని వెంటనే భూముల రికార్డుల్ని మార్పు చేసి బాధిత మహిళలకు న్యాయం చేకూర్చాలని కోరారు.

ప్రయివేటు బస్సు బోల్తా.. 28 మందికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం, హైదరాబాద్‌కు తరలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి అమరావతి వెళుతున్న ప్రయివేట్ బస్సు ఆదివారం తెల్లవారుజామున బోల్తా పడిన సంఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ మండల కేంద్ర సమీపంలో జరిగింది. ప్రయాణికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 25 మంది గాయపడగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ నుంచి రాత్రి ఆరెంజ్ ట్రావెల్‌కు చెందిన బస్సు అమరావతికి బయల్దేరింది. ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్‌తో పాటు 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో గుడిహత్నూర్ సమీపంలోని ఈద్గా వద్ద అదుపు తప్పి బైపాస్ నుంచి బస్సు కిందకు పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న 28 మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గుడిహత్నూర్ ఎస్ఐ మధు కృష్ణ అక్కడి చేరుకొని క్షతగాత్రులను అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. ఇచ్చోడ సీఐ రాజు ఘటనా స్థలంతో పాటు రిమ్స్‌లో చికిత్సలు పొందుతున్న వారితో మాట్లాడారు. రిమ్స్‌కు వచ్చిన క్షతగాత్రులను డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ దగ్గర ఉండి చికిత్సలు అందించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


వైద్యం వికటించి.. మూడు నెలల చిన్నారి మృతి

- సూర్యాపేట ప్రైమ్ పిల్లల హాస్పిటల్ వద్ద ఉద్రిక్తత
- ఆందోళన, ఆత్మహత్యాయత్నం, రాళ్లదాడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సూర్యాపేట జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లోని ప్రైమ్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో ఆదివారం వైద్యం విఫలమై మూడు నెలల బాబు మృతి చెందిన ఘటనతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆగ్రహించిన బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టి అద్దాలు ధ్వంసం చేశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం గుడి తండాకు చెందిన జాటో జలంధర్, మనిషా దంపతుల మూడు నెలల మగబిడ్డకు నాలుగు రోజుల కిందట జ్వరం వచ్చింది. బాలుడ్ని ప్రైమ్ చిన్నపిల్లల హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స చేయించారు. మొదటి రెండు రోజులు బాబు ఆరోగ్యం బాగానే ఉందని, ఆ తర్వాత ఆరోగ్యం క్షీణించిందని తెలిపారు. పరిస్థితి విషమిస్తుండగా హాస్పిటల్ వైద్యులు సరైన శ్రద్ధ తీసుకోలేదని, ఈ క్రమంలో ఖమ్మం లేదా హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారని తెలిపారు. ఖమ్మం తరలించిన తర్వాత బాలుడు అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారన్నారు. తమ బాబు మరణానికి హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ హాస్పిటల్ ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. ఆవేశంతో ఒక బంధువు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తేవడానికి ప్రయత్నించారు. అయితే బంధువులు రాళ్లతో విరుచుకుపడటంతో పోలీసులు, ఆందోళనకారులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒక కానిస్టేబుల్ తలకు తీవ్ర గాయమవడంతో ఆస్పత్రిలో చేర్పించారు. తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోగా, బంధువులు హాస్పిటల్‌ను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు హాస్పిటల్ పై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బంధువులు కోరుతున్నారు. హాస్పిటల్ వద్ద అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



బాధితులను పరామర్శిస్తున్న వృకాస, సిపిఎం, సిఐటియు నాయకులు

ఎరుకల కుటుంబంపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులను అరికట్టాలి
- సిఎం జిల్లాలో దాడులు బాధాకరం : వెంకట్రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎరుకల కుటుంబాలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టిలపై దాడులను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూర్ నియోజకవర్గంలోని చెన్‌గేష్‌పూర్, బెల్కటూర్ గ్రామాల్లో వృకాస, సిపిఎం, సిఐటియు నాయకులు పర్యటించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. దాడులకు గల కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బాధితులు.. తమ సమస్యలను, గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను వివరించారు. తమపై అనవసరంగా దాడికి పాల్పడ్డారంటూ తమ బాధను నాయకులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. చేనిగేష్‌పూర్ గ్రామంలో ఎరుకల కులానికి చెందిన శారద బస్వరాజ్ పనులు చేసుకొని ఇంటికి వెళ్తున్న గ్రామంలో రోడ్డుపైన రమేష్‌గౌడ్ అనే వ్యక్తి ఇంటి దగ్గర అడ్డుకొని బూతులు తిడుతూ.. కులం పేరుతో దూషించినట్టు తెలిపారు. శారద బస్వరాజ్ కుటుంబంపై దాడి చేసిన రమేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నానిగౌడ్, నరేష్‌గౌడ్, పవన్‌గౌడ్‌లను వెంటనే అరెస్టు చేయాలని అన్నారు. జిల్లాలో వరుసగా ఎస్‌పి, ఎస్‌టిలపై దాడులు జరుతున్నాయని తెలిపారు. దళిత యువకుడు పెళ్లి ఊరేగింపు బరాత్‌ను అడ్డుకొని దాడి చేసిన ఘటన మరువకముందే.. ఎరుకల కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడటం దారుణమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సొంత జిల్లాలో ఇలాంటి ఘటనలు జరగడం శోచనీయమని అన్నారు. వరుసగా ఇన్ని ఘటనలు జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే కానీ, జిల్లా అధికారులు కానీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలిపారు.

సుగుణమ్మ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- ఉభయ కమ్యూనిస్టు పార్టీల విలీనాన్ని కాంక్షించిన సుగుణమ్మ : జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సాయుధ పోరాట యోధురాలు సుగుణమ్మ ఆశయ సాధనకు కృషి చేద్దామని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి అన్నారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు.. అణగారిన వర్గాలకు ప్రాణం పోసేందుకు ఉభయ కమ్యూనిస్టు పార్టీల విలీనాన్ని ఆమె కాంక్షించిందని పలువురు వక్తలు అన్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్.. ఇంద్రజిత్ గుప్తా హాల్‌లో ప్రముఖ కమ్యూనిస్టు నేత శాకమూరి సుగుణమ్మ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. ఈ సభలో సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి మాట్లాడారు. పోరాట యోధురాలైన సుగుణమ్మ మరణం మహిళా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. సుగుణమ్మ తన చివరి ఊపిరి ఉన్నంత వరకూ ప్రజల కోసం పని చేశారని గుర్తు చేశారు. సమాజం మనకు ఏం ఇచ్చిందనే భావనతో కాకుండా మనం సమాజానికి ఏం చేశామనే ఆలోచనతోనే ఆమె ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. ఉద్యమాలను ఎలా చేయాలో రాబోయే తరాలకు సుగుణమ్మ బాట వేశారన్నారు. ఆమె జీవితం మొత్తం కమ్యూనిస్టు ఉద్యమాలతోనే ముడిపడిందన్నారు. భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన సుగుణమ్మ.. ఆమె భర్త ఎస్‌వికె ప్రసాద్‌కు తోడుగా ఉద్యమంలో పాల్గొన్నారని, కమ్యూనిస్టులు ఏకం కావాలన్నదే ఆమె చివరి కోరిక అని తెలిపారు.



సభలో మాట్లాడుతున్న జ్యోతి

తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కలవాలని ప్రజలు బలంగా కోరుతున్నారని, సుగుణమ్మ కోరిక కూడా అదేనని అన్నారు. కర్రగుట్ట, చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం ఊచకోత కోస్తుంటే ఎందుకు ఆత్మవిమర్శ చేసుకోవడం లేదని, తుపాకీతో కేంద్రాన్ని పడగొట్టే సత్తా ఉందా అనేది ఆలోచించాలన్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి నేదునూరి జ్యోతి, సుగుణమ్మ కూతురు డాక్టర్ శాకమూరి శోభ, కుమారులు డాక్టర్ శాకమూరి రవి, శాకమూరి రమేష్, సుగుణమ్మ సంరక్షకులు జిలానీ తదితరులు సుగుణమ్మ ఉద్యమ చరిత్రను గుర్తు చేశారు. ఆమె ఆశయాల సాధన కోసం మునుముందు ఉద్యమాలను బలోపేతం చేస్తామన్నారు. అంతకుముందు సుగుణమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నేతలు ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మాజీ ఎమ్మెల్సీ పిజె చంద్రశేఖర్, సీనియర్ నాయకులు డాక్టర్ బివి విజయలక్ష్మి, సిఆర్ ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జె కల్పన, ఎన్ఆర్ఆర్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ డా॥ టి సురేష్, సభ్యులు కె జ్యోష్నా, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

మిల్లెట్ బిస్కెట్ల యూనిట్‌పై ప్రధాని మాట్లాడటం సంతోషం

- నిరుద్యోగ యువతులు వ్యాపార రంగంలో రాణించాలి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మిల్లెట్ బిస్కెట్ల ఘనత జాతీయస్థాయి వరకు వెళ్లి ఐటిడిఎ భద్రాచలం పేరును భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తావించి ప్రశంసలు కురిపించడం చాలా ఆనందంగా ఉందని, అందుకు మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. నిరుద్యోగులైన గిరిజన యువతులు ప్రపంచంలో పోటీపడి డిమాండ్‌ను బట్టి వ్యాపారం చేసి నష్టపోకుండా అధిక లాభాలు పొంది, జీవనోపాధి పెంపొందించుకోవాలని తెలిపారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటిడిఎ ప్రాంగణంలోని వైటీసీలో గిరిజన యువతులు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఐటిడిఎ పిఓ బి రాహుల్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ కలిసి యువతులకు వ్యాపారంలోని మెలకువలు, సలహాలు, సూచనలు అందించారు. అనంతరం పిఎంఆర్‌సి శ్రీరామ జాయింట్ లియాబిలిటీ మిల్లెట్ బిస్కెట్ యూనిట్‌ని సంప్రదించి బిస్కెట్ల తయారీ కోసం కొనుగోలు చేసే ముడి సరుకుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లెట్ బిస్కెట్లకు అవసరమయ్యే రాగులు, సజ్జలు, నెయ్యి ఇతర వస్తువులు బయట నుంచి కాకుండా మన పంట పొలాల్లో రాగులు, సజ్జలు పండించుకోవాలని సూచించారు. నెయ్యిని మాత్రం మన గ్రామాల్లోనే పశుసంపద ఎక్కువగా ఉన్నందున స్వచ్ఛమైన నెయ్యిని కొనుగోలు చేసుకోవాలన్నారు. ఇదే స్ఫూర్తితో ఎటువంటి కల్తీ లేని ఆర్గానిక్ తినుబండారాలు తయారు చేసి మ్యూజియం, దేవస్థానంకు వచ్చే భక్తులకు అందించాలని అన్నారు. మిల్లెట్ బిస్కెట్లకు సంబంధించిన బ్రాండింగ్ స్టిక్కర్లు సెలెక్ట్ చేసి ఐటిడిఎకు మంచి గుర్తింపు వచ్చేలా చూడాలని తెలిపారు. కుట్టు శిక్షణ నేర్చుకున్న యువతులను హైదరాబాద్ పంపించి బొంబాయి, పూణే నుంచి వచ్చిన ఫ్యాషన్ డిజైనర్లతో మమేకం చేసి కొత్త కొత్త డిజైన్లు తయారు చేసే విధంగా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. నేర్చుకున్న వారు తమ గ్రామాల్లోని మహిళల డిమాండ్‌ను బట్టి బట్టలు డిజైనింగ్ చేయాలన్నారు. వాటిని హైదరాబాద్‌లోని శిల్పారామంలో అమ్ముకునే విధంగా అవకాశం కల్పిస్తామని అన్నారు. వ్యాపారం ప్రారంభించాలనుకునే మహిళలు.. గ్రామంలోని అంగన్వాడీ సెంటర్, ప్రభుత్వ పాఠశాలల పక్కన కుట్టుమిషన్ల వర్క్ షెడ్లను ఇజిఎస్ ద్వారా కట్టించుకొని వ్యాపారం చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం మిల్లెట్ బిస్కెట్లను పిఓ బి రాహుల్, ఎఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మకు యువతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఓ సున్నం రాంబాబు, ఇఇ ట్రైబల్ వెల్ఫేర్ హరీశ్, ఎసిఎంఓ రమేశ్, టిఎ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

